సాక్షి
డా. బి ఆర్ అంబేడ్కర్ కోనసీమ
మంగళవారం । 17 । సెప్టెంబర్ । 2024



మహా ప్రసాదం స్వామీ..

అల్లవరం పాలంలో శ్రీవరసిద్ధి వినాయకుని ఆలయంలో స్వామికి సమర్పించిన 18 కిలోల లడ్డూను వేలంలో రూ.1.85 లక్షలకు కాండ్రేగుల వెంకటేశ్వరరావు, నరసింహారావు దంపతులు దక్కించుకున్నారు.




కందుకూరి స్ఫూర్తి.. విద్యాదీప్తి

వరల్డ్ ఎడ్యుకేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన సర్వేలో రాజమహేంద్రవరం కందుకూరి రాజ్యలక్ష్మి మహిళా డిగ్రీ కళాశాల రాష్ట్రంలో ఐదో స్థానం. దేశ వ్యాప్తంగా 71వ స్థానంలో నిలిచింది.

8లో

4.40 లక్షల క్యూసెక్కుల విడుదల



ధవళేశ్వరం: కాటన్ బ్యారేజీ నుంచి సోమవారం సాయంత్రం 4,40,516 క్యూసెక్కుల మిగులు జలాలను సముద్రంలోకి విడుదల చేశారు. 7.60 అడుగుల నీటిమట్టం నమోదైంది. తూర్పు డెల్టాకు 4,600, మధ్య డెల్టాకు 2,300, పశ్చిమ డెల్టాకు 6,500 క్యూసెక్కుల నీటిని వదిలారు.

న్యూస్‌రీల్

అన్నదాన భవన నిర్మాణానికి రూ.50 వేలు విరాళం



దాతకు స్వామి వారి చిత్రపటం అందజేస్తున్న ఆలయ ఈఓ

ఆత్రేయపురం: కోనసీమ తిరుపతిగా ఖ్యాతికెక్కిన వాడపల్లి శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వర స్వామి ఆలయ ఆవరణలో నిర్మిస్తున్న వకుళమాత అన్నదాన భవన నిర్మాణానికి భీమవరం మండలం తాడేరుకు చెందిన గంటా వెంకటరావు, మణికుమారి దంపతులు రూ.50 వేల విరాళం అందించినట్లు ఆలయ ఈఓ భూపతిరాజు కిషోర్ కుమార్ తెలిపారు. దాతకు ఆయన చేతుల మీదుగా స్వామి వారి చిత్రపటం అందజేశారు.

అమలాపురంలో గ్యాస్ లీకేజీ కలకలం

- కుమ్మరి కాల్వపై సోదాలు చేసిన పోలీస్, ఫైర్ అధికారులు
- అది గ్యాస్ కాదన్న నిర్ధారణతో ఊపిరి పీల్చుకున్న ప్రజలు

అమలాపురం టౌన్: అమలాపురం పట్టణం మీదుగా ప్రవహించే కుమ్మరి కాల్వ (డ్రెయిన్) లోంచి గ్యాస్ లీకైన వాసన వస్తోందని ఆ చెంతనే ఉన్న మున్సిపల్ కాలనీ, ఈడబ్ల్యూఎస్ కాలనీల ప్రజలు ఆదివారం రాత్రి నుంచి ఆందోళన చెందారు. పట్టణంలో గ్యాస్ లీకైన వాసన వస్తోందన్న సమాచారం సోమవారం తెల్లవారు జాము నుంచి కలకలం మొదలైంది. మున్సిపల్ కాలనీని ఆనుకుని వెళుతున్న కుమ్మరి కాల్వ నుంచే గ్యాస్ లీకైన వాసన వస్తోందని కాలనీ వాసులు కంగారు పడ్డారు. ఈ సమాచారం పట్టణ పోలీసులకు చేరడంతో వారు కూడా అప్రమత్తమయ్యారు. పట్టణ సీఐ పి.వీరబాబు ఈ సమాచారాన్ని మున్సిపల్ కమిషనర్ ఎస్.మనోహర్, అగ్నిమాపక దళాధికారి కె.మురళీ కొండబాబులకు సోమవారం తెల్లవారుజామును ఫోన్లు చేసి తెలిపారు. దీంతో ఆ మూడు శాఖల అధికారులు సోమవారం తెల్లవారు జాము 4.30 గంటలకు కుమ్మరి కాల్వ గట్ల వెంబడి తిరిగి గ్యాస్ లీకైన వాసన ఎక్కడ నుంచి వస్తోందో కనుగొనే ప్రయత్నం చేశారు. అగ్నిమాపక దళాధికారి కొండబాబు అది గ్యాస్ లీకైన వాసన కాదని నిర్ధారించారు. దీంతో గ్యాస్ లీకైన వాసన కాదని తెలియడంతో ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు. అగ్నిమాపక అధికారి కొండబాబు చమురు సరఫరా సంస్థకు సంబంధించి అల్లవరంలో ఉన్న ఓ కార్యాలయానికి ఫోన్ చేసి మీ గ్యాస్ పైపులైన్లు ఎక్కడైనా లీకయ్యాయా అని ఆరా తీశారు. అసలు అమలాపురం పట్టణంలో గ్యాస్ పైపులైన్లే లేవని వారు స్పష్టం చేశారు. ఆయన ఎలాంటి ప్రమాదం లేదని చెప్పిన తర్వాత ప్రజలు తమ తమ ఇళ్లలో సోమవారం గ్యాస్ స్టౌలు వినియోగించారు.

రేపు క్రికెట్ క్రీడాకారుల ఎంపిక

నాగమల్లితోట జంక్షన్ (కాకినాడ సిటీ): జిల్లా బాలురు, బాలికల క్రికెట్ సంఘం ఆధ్వర్యంలో ఈ నెల 18వ తేదీ బుధవారం అండర్-14 క్రికెట్ క్రీడాకారుల ఎంపికలు నిర్వహిస్తున్నట్లు సంఘ కార్యదర్శి పి.సత్యనారాయణ సోమవారం తెలిపారు. స్థానిక ఆర్ఎంసీ క్రీడా మైదానంలో ఉదయం 8 గంటలకు ఈ ఎంపికలు ప్రారంభం అవుతాయన్నారు. 2010 సెప్టెంబరు 1 తర్వాత జన్మించిన అభ్యర్థులు అర్హులన్నారు. ఆసక్తి గలవారు అర్హత పత్రాలతో హాజరు కావాలని ఆయన కోరారు.

నిర్విఘ్నంగా దోపిడీ

- దోచుకున్నవారికి దోచుకున్నంత..
- పూజల నుంచి ఉత్సవాల వరకు ప్రతిదానికీ ఒక రేటు
- మండపాలు.. ఇతర అలంకరణల్లో చేతివాటం
- గతేడాది కన్నా అధికంగా కొటేషన్లు
- అధికారం మారాక ఆలయంలో కూటమి నేతల హల్‌చల్



చవితి ఉత్సవాల తొలి రోజు ఆలయంలో ధ్వజస్తంభం వద్ద ఏర్పాటు చేసిన పువ్వుల అలంకరణ

సాక్షి, అమలాపురం/అయినవిల్లి: అయినవిల్లి శ్రీ సిద్ధి వినాయక స్వామి ఆలయంలో కూటమి ప్రభుత్వం వచ్చిన తరవాత దోచుకున్నవారికి దోచుకున్నంతగా మారిపోయింది. అటు టీడీపీ నేతలు.. ఇటు జనసేన నాయకులు తాము చెప్పిందే జరగాలన్నట్టు.. తమ వారికే కాంట్రాక్టులు ఇవ్వాలన్నట్టుగా బడా నేతల సిఫారసులతో హల్‌చల్ చేస్తున్నారు. ఇక్కడ జరిగే ప్రత్యక్ష పూజల నుంచి స్వామి వారి చవితి ఉత్సవాల ఏర్పాట్ల వరకు ప్రతి దానిని ఆదాయ మార్గాలుగా మలుచుకుంటున్నారు. వీరికి ఆలయ అధికారులు.. పూజలు నిర్వహించే అర్చకుల వరకు సహకరిస్తుండడం విశేషం.

అయినవిల్లి విఘ్నేశ్వరస్వామి ఆలయం రాష్ట్రంలో కాణిపాకం తరువాత అతి పెద్ద ఆలయం. ఇది స్వయంభూగా వెలసిన గణపతి క్షేత్రం. ఈ ఆలయానికి ఇటీవల భక్తుల తాకిడి పెరిగింది. ఇంతటి ప్రాశస్త్యం ఉన్న ఆలయంలో ఇటీవల చోటు చేసుకుంటున్న దోపిడీ పర్వం భక్తులను ఆందోళనకు, ఆవేదనకు గురి చేస్తోంది. కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత జనసేన, టీడీపీ నేతల హవా కొనసాగుతోంది. స్థానిక ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణకు ముఖ్య అనుచరులమని చెప్పి కొంతమంది ఆలయాధికారులపై రుబాబు ప్రదర్శిస్తున్నారు. కావాల్సిన వారికి ప్రత్యేక దర్శనాలు, పూజలు పేరుతో రోజు సిఫారసులు పెరిగిపోయాయి. చివరకు స్వామివారిని చవితి మహోత్సవాలకు చేపట్టిన ఏర్పాట్లలో భారీగానే చేతివాటం ప్రదర్శించారు. కావాల్సిన వారితో అధిక రేట్లకు టెండర్లు వేయించారు. ఉదాహరణకు సౌండ్ సిస్టం, జనరేటర్‌కు గత ఏడాది రూ.1.60 లక్షలకు కొటేషన్ వేస్తే ఈసారి రూ.2.85 లక్షల వరకు పెంచేశారు. ఆలయం బయట విద్యుత్ దీపాలంకరణకు గత ఏడాది రూ.1.95 లక్షల టెండర్ వేస్తే ఈసారి 2.72 లక్షలకు పెంచారు. తూర్పు, దక్షిణ రాజగోపురాలకు విద్యుదీకరణకు గతంలో రూ.1.70 లక్షలకు కొటేషన్ వేస్తే ఈసారి రూ.2.75 లక్షలకు, తొమ్మిది రోజుల పాటు గ్రామోత్సవం, మాఢవీధుల్లో ఊరేగింపు ఖర్చులకు గత ఏడాది రూ.88 వేలు కొటేషన్ వేస్తే ఈసారి రూ.1.41 లక్షలకు వేశారు. ఇక గత ఏడాది కన్నా తక్కువ కొటేషన్ వేసిన పూల డెకరేషన్, పూలదండలు వంటి వాటికి అలంకరణ అత్యంత పేలవంగా నిర్వహించారు. విద్యుత్, పువ్వుల డెకరేషన్ చూసి స్థానికులు పెదవి విరుస్తున్నారు. పువ్వుల డెకరేషన్ రెండుసార్లు పూర్తి స్థాయిలో చేయాల్సి ఉండగా, రెండో సారి మమా అనిపించేశారు. ఈ మాత్రం నాసిరకం పనులకు ఏకంగా ఈ మాత్రం టెండర్లకు ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి కార్యాలయాల నుంచి స్థానిక ప్రజా ప్రతినిధుల నుంచి ఫోన్ల మీద ఫోన్లు చేసి ఒత్తిడి చేయించారు. చివరకు స్వామివారి ఉత్సవాల సందర్భంగా నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాల విషయంలో కూడా చేతివాటం ప్రదర్శించారనే విమర్శలు వినిపిస్తున్నాయి.

ఇదిలా ఉండగా స్వామివారి ఆలయంలో పాలు, పెరుగు, కూరగాయలు, నెయ్యి, నిత్యావసరాల టెండర్లు దక్కించుకున్నవారు సైతం ప్రభుత్వం మారిన తరువాత అడ్డం తిరిగారు. వాటి సరఫరాలో చేతివాటం ప్రదర్శిస్తున్నారు. వీరికి సైతం స్థానిక జనసేన, టీడీపీ నేతల వత్తాసు ఉండడంతో చెలరేగిపోతున్నారు. వినాయక సేవా సత్రం (టీటీడీ కల్యాణ మండపం) రీ మోడలింగ్ పేరుతో సొమ్ములు వృథా అవుతున్నాయనే ఫిర్యాదులు అందుతున్నాయి.

ప్రైవేట్ హోమాలపై విమర్శల వెల్లువ

ఆలయంలో అనునిత్యం లక్ష్మీ గణపతిహోమం జరుగుతోంది. ఇది కాకుండా ఇటీవల కాలంలో ప్రైవేట్ హోమాలు (వ్యక్తిగత హోమాలు) లక్ష్మీ గణపతి హోమం, ఏకాదశ రుద్రాభిషేకం, లక్ష దుర్వార్చన, పంచామృతాభిషేకం నిర్వహిస్తుండడం గమనార్హం. భక్తుల సంఖ్య పెంచేందుకు, భక్తుల కోరిక తీర్చేందుకు ఈ పూజలు నిర్వహిస్తున్నట్టు అర్చకులు, ఆలయాధికారులు చెబుతున్నారు. కానీ వాస్తవంగా ఈ పూజకు రూ.80 వేల నుంచి రూ.1.20 లక్షల వరకు వసూలు చేస్తున్నట్టు సమాచారం. కాని ఆలయానికి మాత్రం రూ.రెండు వేలు మాత్రమే చెల్లిస్తున్నారని తెలిసింది. మిగిలిన సొమ్ము వేద పండితులు, పూజా ద్రవ్యాలకు అని చెబుతున్నారు. కాని వాస్తవంగా వాటికి ఇంత ఖర్చు అవ్వదని సామాన్య భక్తులు ఆరోపిస్తున్నారు. అదేదో దేవదాయ శాఖ ఈ సొమ్ము వసూలు చేస్తే ఆదాయం పెరుగుతోందని వారు చెబుతున్నారు. ప్రస్తుతం గణపతి నవరాత్రుల్లో భక్తుల తాకిడి ఆసరాగా చేసుకుని వ్యక్తిగత హోమాలు అధికంగా నిర్వహిస్తున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.



రెండ్రోజుల తర్వాత ధ్వజస్తంభం వద్ద ఇదీ పరిస్థితి



పేలవంగా ఏర్పాటు చేసిన విద్యుత్ దీపాల అలంకరణ

ప్రత్యేక హోమానికి రూ.రెండు వేలు



ఆలయంలో సామూహికంగా చేసే హోమ ద్రవ్యాలు దేవస్థానం ఏర్పాటు చేసి, హోమం చేసే పండితులకు నెలకు ఒకసారి సంభావన ఇస్తున్నాం. ఇదే ప్రత్యేకంగా చేసుకునే హోమాలకు పూజారులకు ఇచ్చే సంభావనతో సహా అన్ని ఖర్చులూ చేయించుకునే వారివే. దేవస్థానం నుంచి మాత్రం రూ.రెండు వేలు టిక్కెట్ కొనుగోలు చేయాలి. ప్రతి ఆలయంలోనూ లక్ష బిల్వార్చన, లక్షతులసి పూజ చేయించుకుంటారు. అందుకు ఏ ఆలయంలోనూ అభ్యంతరం తెలపరు.

– ఎం.సత్యనారాయణ రాజు, ఆలయ అసిస్టెంట్ కమిషనర్, అయినవిల్లి

నేటి నుంచి స్కూల్ కాంప్లెక్స్ సమావేశాలు

రాయవరం: రెండు రోజుల పాటు జరిగే పాఠశాల స్థాయి స్కూల్ కాంప్లెక్స్ సమావేశాలు మంగళవారం జిల్లా వ్యాప్తంగా ప్రారంభం కానున్నాయి. 2024-25 విద్యా సంవత్సరానికి ఉపాధ్యాయులకు పాఠశాల సముదాయ సమావేశాలు నిర్వహించాలని రాష్ట్ర సమగ్ర శిక్షా అధికారులు జారీ చేసిన ఉత్తర్వుల నేపథ్యంలో భాగంగా సెప్టెంబర్ నెల కాంప్లెక్స్ సమావేశాలను నిర్వహిస్తున్నారు. సమగ్ర శిక్షా అదనపు ప్రాజెక్టు కోఆర్డినేటర్ పాఠశాల సముదాయ సమావేశాల నిర్వహణకు జిల్లా స్థాయిలో ఆదేశాలు జారీ చేశారు. ఈ ఆదేశాలు మండల విద్యాశాఖ అధికారులకు చేరుకున్నాయి. ఈ ఉత్తర్వుల ప్రకారం జిల్లాలోని 22 మండలాల్లో 45 ప్రాథమిక స్థాయి కాంప్లెక్స్ సమావేశాలు నిర్వహించనున్నారు. ఈ కాంప్లెక్స్‌ల పరిధిలోని 50 శాతం ఉపాధ్యాయులు మంగళవారం జరిగే కాంప్లెక్స్ సమావేశాల్లో హాజరు కానుండగా, మిగిలిన 50 శాతం ఉపాధ్యాయులు వారికి నిర్దేశించిన కాంప్లెక్స్‌ల్లో బుధవారం హాజరు కానున్నారు. అలాగే తెలుగు, గణితం, బయోలాజికల్ సైన్స్ ఉపాధ్యాయులకు తొలి రోజు సబ్జెక్టు కాంప్లెక్స్ సమావేశాలు జరగనుండగా, ఇంగ్లీషు, ఫిజికల్ సైన్స్, హిందీ, సోషల్ సబ్జెక్టు ఉపాధ్యాయులకు రెండో రోజు సబ్జెక్టు కాంప్లెక్స్ సమావేశాలు నిర్వహించనున్నారు. అలాగే ఉన్నత పాఠశాలల్లో పనిచేసే వ్యాయామ ఉపాధ్యాయులకు స్పోర్ట్స్ కాంప్లెక్స్ సమావేశాలను తొలి రోజు మంగళవారం నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. ఈ సమావేశాలు ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4.30 గంటల వరకు నిర్వహించాల్సి ఉంటుంది. జిల్లాలో 122 స్కూల్ కాంప్లెక్స్‌లు ఉండగా, వాటి పరిధిలో 5,442 ప్రాథమిక పాఠశాలల ఉపాధ్యాయులు స్కూల్ కాంప్లెక్స్ సమావేశాల్లో హాజరు కానున్నారు. అలాగే 5,200 మంది వివిధ సబ్జెక్టులకు సంబంధించిన ఉపాధ్యాయులు, వ్యాయామ ఉపాధ్యాయులు స్కూల్ కాంప్లెక్స్ సమావేశాల్లో పాల్గొననున్నారు. ఇదిలా ఉంటే కాకినాడ, తూర్పుగోదావరి, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జిల్లాలకు సంబంధించిన ఉర్దూ టీచర్లకు ఈ నెల 19న అమలాపురంలోని మకా ఉర్దూ మీడియం పాఠశాలలో నిర్వహించనున్నట్లు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. కాంప్లెక్స్ సమావేశాలను సమర్థవంతంగా నిర్వహించేందుకు నియమించిన రీసోర్స్ పర్సన్లకు ఆన్‌లైన్ ఓరియంటేషన్ తరగతులను నిర్వహించారు. ఇదిలా ఉంటే ప్రాథమిక, సబ్జెక్టు, స్పోర్ట్స్ కాంప్లెక్స్ సమావేశాలను జిల్లా విద్యాశాఖ అధికారి, సమగ్ర శిక్షా ఏపీసీ, జిల్లాలోని ఉప విద్యాశాఖాధికారులు, మండల విద్యాశాఖాధికారులు, సమగ్ర శిక్షా సెక్టోరల్ అధికారులు పర్యవేక్షణ చేయనున్నారు.

రిజర్వ్ ఫారెస్ట్‌లోనే చిరుతపులి



చిరుతపులిని బంధించేందుకు ఏర్పాటు చేసిన బోను

రాజానగరం: దివాన్‌చెరువు రిజర్వ్ ఫారెస్ట్ ఏరియాలో సంచరిస్తూ, అక్కడ అమర్చిన ట్రాప్ కెమెరాల్లో సోమవారం తెల్లవారు జామున కనిపించిన చిరుతపులి, ఆ తరువాత గడచిన 24 గంటల్లో ఏ కెమెరాకు చిక్కలేదని జిల్లా అటవీ శాఖ అధికారి ఎస్.భరణి తెలిపారు. అలాగని అది ఎక్కడికో వెళ్లిందనుకోవద్దని, ఇప్పటికీ దివాన్‌చెరువు ఫారెస్ట్‌లోనే ఉందన్నారు. దానిని బంధించేందుకు శాఖాపరంగా చేస్తున్న ప్రయత్నాలు నిర్విరామంగా కొనసాగుతున్నాయని అన్నారు. ఈ విషయమై కొంతమంది వ్యక్తులు పనిగట్టుకుని చేస్తున్న అసత్య ప్రచారాలను నమ్మవద్దని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఆ పరిసరాల్లో నివాసం ఉంటున్న ప్రజలకు, జాతీయ రహదారి వెంబడి ప్రయాణించే వారికి ఎప్పటిలాగే జాగ్రత్తలు చెప్పారు.

ఉలిక్కిపడ్డ రావులచెరువు

- విస్ఫోటం ధాటికి గాల్లోకి ఎగిరిపడ్డ నలుగురు, రెండు బైక్‌లు
- బాణసంచా తయారీ వల్లేనని అధికారుల ప్రాథమిక అంచనా



రావులచెరువులో విస్ఫోటానికి గురైన ఇంటి ప్రాంతాన్ని పరిశీలిస్తున్న ఎస్పీ కృష్ణారావు



చికిత్స పొందుతున్న క్షతగాత్రులు

అమలాపురం టౌన్: స్థానిక నల్ల వంతెన సమీపంలోని రావులచెరువు వద్ద సోమవారం ఉదయం 9.45 గంటలకు నాగేశ్వరరావు ఇంటి నుంచి పెద్ద పేలుడు శబ్దం రావడంతో ఆ ప్రాంతం ఉలిక్కిపడింది. ఇరుగు పొరుగు వారు ప్రాణభయంతో పరుగులు తీశారు. కనురెప్ప పాటులో ఇల్లు తునాతునకలై శకలాలు నేలమట్టం కావడం చూసి రావులచెరువు ప్రజలు ఆందోళనకు గురయ్యారు. ప్రమాదం జరిగిన ఇంట్లో బాణసంచా తయారు చేస్తున్న ఆనవాళ్లను పోలీసులు గుర్తించారు. బాణసంచా తయారీ వల్లేనని ఈ ప్రమాదం సంభవించిందని అధికారులు ప్రాథమికంగా అంచనా వేశారు. విస్ఫోటంతో ఆ ఇంటి వారే కాకుండా పనిచేస్తున్న వారు కూడా క్షతగాత్రులయ్యారు. పేలుడు ధాటికి ఆ ఇంట్లో ఉన్న నలుగురు గాల్లోకి ఎగిరి కింద పడ్డారు. రెండు మోటారు సైకిళ్లు కూడా ఎగిరి పడ్డాయి. ఆ మోటారు సైకిళ్లు కూడా పేలుడికి పూర్తిగా కాలిపోయాయి. క్షతగాత్రులను అత్యవసర వైద్యం కోసం స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కొందరిని మెరుగైన వైద్యం కోసం కిమ్స్ ఆస్పత్రికి పంపించారు. అమలాపురం డీఎస్పీ ప్రసాద్ ఘటనా స్థలంలో ఉండి తునాతునకలైన భవన శిథిలాల కింద ఎవరైనా ఉన్నారా..? అనే అనుమానంతో జేసీబీతో వాటిని పెకిలించి పరిశీలించారు. ప్రమాదంలో రావులచెరువుకు చెందిన గువ్వాల నాగేశ్వరరావు, గొవ్వాల నాగలక్ష్మి, గొవ్వాల రాజు, చొల్లంగి మారుతీ సుబ్రహ్మణ్యం, బొక్కా మోహనప్రియ, దూనబోయిన సుబ్బలక్ష్మి, పాండిచ్చేరి యానానికి చెందిన కట్టా వేణు, కట్టా వెంకట్ తీవ్రంగా గాయపడ్డారు.

విస్ఫోటంతో వచ్చిన మంటలకు ఈ ఎనిమిది మంది శరీరాలు పలుచోట్ల కాలిపోయాయి. విస్ఫోటం ధాటికి పలు చిన్న చిన్న శకలాలు వారి తలల్లో గుచ్చుకుపోయాయి. ఇరుగు పొరుగుకు చెందిన మిగిలిన ఆరుగురు స్వల్పంగా గాయపడగా చికిత్స అనంతరం ఇళ్లకు చేరుకున్నారు. వీరిలో గొవ్వాల నాగేశ్వరావు, నాగలక్ష్మి దంపతుల ఇంట్లోనే విస్ఫోటనం సంభవించింది. నాగలక్ష్మి తలకు తీవ్ర గాయం కావడంతో ఆమె పరిస్థితి విషమంగా ఉంది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు పట్టణ సీఐ వీరబాబు చెప్పారు.

పేలుడు విచారకరం



రావులచెరువులో పేలుడు సంఘటన స్థలాన్ని పరిశీలించి బాధితులతో మాట్లాడుతున్న మంత్రి సుభాష్

అమలాపురం రూరల్: గ్యాస్ సిలిండర్ లీక్‌తో బాణాసంచా పేలుడు సంభవించడం విచారకరమని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ పేర్కొన్నారు. సోమవారం పేలుడులో గాయపడిన క్షతగాత్రులను కిమ్స్ ఆసుపత్రిలో మంత్రి పరామర్శించి క్షతగాత్రుల్లో ధైర్యాన్ని నింపారు. మంత్రి మాట్లాడుతూ బాణసంచా తయారీకి సంబంధించి లైసెన్సులు లేని వారిపై కఠినమైన చర్యలు తీసుకుంటుమని మంత్రి స్పష్టం చేశారు. అనంతరం రావులచెరువులో పేలుడు సంఘటన స్థలాన్ని పరిశీలించారు.

వైద్య వ్యవస్థ నిర్వీర్యమే లక్ష్యం

- కూటమి ప్రభుత్వం వచ్చాక వివాదాస్పద నిర్ణయాలు
- జీఓ 85 రద్దు చేయాల్సిందేనని వైద్యుల డిమాండ్
- డిమాండ్ల పరిష్కారంపై వ్యవధి కోరిన డీహెచ్
- ప్రభుత్వ అభ్యర్థనతో చలో విజయవాడ వాయిదా



పెదపళ్ల పీహెచ్‌సీలో వైద్యులు అత్యవసర సేవలకే పరిమితం కావడంతో కిక్కిరిసిన రోగులు



అమలాపురంలోని డీఎంహెచ్‌ఓ కార్యాలయంలో జీఓ 85 రద్దు చేయాలని కోరుతూ వినతి పత్రాన్ని అందజేస్తున్న వైద్యుల బృందం

ఆలమూరు: రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం కొలువుదీరాక వైద్యరంగంలో వరుస వివాదాస్పద నిర్ణయాలను తీసుకుంటుంది. వైద్యుల హక్కులను పరిరక్షించవలసిన ప్రభుత్వం వైద్య వృత్తినే నిర్వీర్యం చేసే పనిలో నిమగ్నమైంది. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో వైద్య ఆరోగ్యశాఖలో విప్లవాత్మక మార్పులు తీసుకువచ్చి గ్రామీణ ఆరోగ్య వ్యవస్థను బలోపేతం చేసింది. పీహెచ్‌సీలో కచ్చితంగా ఇద్దరు వైద్యులతో పాటు 14 మంది సిబ్బందిని వివిధ హోదాల్లో నియమించి గ్రామీణ ప్రాంత ప్రజలకు నాణ్యమైన వైద్య ఆరోగ్య సేవలను అందించేందుకు రూపకల్పన చేసింది. ప్రస్తుత కూటమి ప్రభుత్వం ప్రైవేట్ ఆస్పత్రులను ప్రోత్సహించే చర్యలు తీసుకుంటూ పేద ప్రజల ఆరోగ్యానికి తూట్లు పొడిచే విధంగా నిర్ణయాలను తీసుకుంటుంది. రాష్ట్ర ప్రభుత్వం రెండు నెలల క్రితం జారీ చేసిన జీఓను వ్యతిరేకిస్తూ అనేక రూపాల్లో వైద్యుల బృందం తమ అసంతృప్తిని తెలియజేస్తూ వచ్చింది. ఇటీవల నీట్ ప్రవేశపరీక్ష షెడ్యూల్ విడుదల చేయడంతో చేసేదేమీ లేక వైద్యుల బృందం నిరసనలకు దిగక తప్పలేదు. అలాగే ప్రభుత్వ వైద్య సంస్థల్లో స్పెషలిస్టు వైద్యులు అవసరం లేదనే అభిప్రాయం వచ్చే విధంగా వైద్య ఆరోగ్యశాఖ ఉన్నతాధికారులు ప్రసంగించడాన్ని రాష్ట్ర వైద్యుల బృందం తప్పుపడుతుంది. రాష్ట్రంలో ప్రభుత్వాలు ఎన్ని మారినా నాటి పాలకులు ప్రజారోగ్య వ్యవస్థకు అత్యంత ప్రాధాన్యం ఇచ్చేవారు. ప్రజా ప్రయోజనాల దృష్ట్యా అప్పటి ప్రజా ప్రతినిధులు వైద్యరంగానికి పెద్ద పీట వేస్తూ పాలన సాగించగా నేటి ప్రభుత్వం మాత్రం వైద్యులకు ఉన్న హక్కులను హరిస్తుందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. గ్రామీణ పీహెచ్‌సీల్లో మూడేళ్ల పనిచేసే వైద్యులకు, ఏజెన్సీ ప్రాంతంలో రెండేళ్ల పనిచేసిన వైద్యులకు ఇన్ సర్వీసెస్ రిజర్వేషన్ కోటా కింద ప్రవేశ పరీక్షలు రాసి పీజీ కోర్సులకు ఎంపిక చేయడం ఆనవాయితీగా వస్తుంది. వైద్య ఆరోగ్యశాఖ అమలులో ఉన్న క్లినికల్ సీట్ల విభాగంలో 30 శాతం, నాన్ క్లినికల్ విభాగంలో 50 శాతం మేర కచ్చితంగా గత ప్రభుత్వం రిజర్వేషన్లు అమలు చేసి దానికనుగుణంగా ప్రభుత్వ వైద్యుల ఉన్నత విద్య కోసం తమ వంతు సహాయ సహకారాలను అందించేవారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే గత నెలలో ఇన్ సర్వీసెస్ కోటాలను క్లినికల్ సీట్ల విభాగంలో 15 శాతానికి, నాన్ క్లినికల్ సీట్ల విభాగంలో 30 శాతానికి తగ్గిస్తూ జీఓ నెం 85ను అమలులోకి తీసుకువచ్చింది. దీంతో పీహెచ్‌సీల్లో పనిచేసే వైద్యులు ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంతో ఖంగుతిన్నారు. ప్రభుత్వం తీసుకున్న ఈ వివాదాస్పద నిర్ణయాన్ని ఉపసంహరించుకునే వరకూ నిరసనలు కొనసాగిస్తామని హెచ్చరిస్తున్నారు. వైద్యులను ప్రోత్సహించవలసిన ప్రభుత్వం అందుకు విరుద్ధంగా ప్రజా వ్యతిరేక నిర్ణయాలు తీసుకోవడం సరికాదనే అభిప్రాయం సర్వత్రా వ్యక్తమవుతుంది.

వైద్య ఆరోగ్యశాఖను నిర్వీర్యం చేసేందుకేనా?

రాష్ట్ర ప్రభుత్వం అధీనంలోని వైద్య ఆరోగ్యశాఖను నిర్వీర్యం చేసి ప్రైవేట్ వైద్యరంగాన్ని ప్రోత్సహించేందుకే ప్రజా వ్యతిరేక విధానాలను తీసుకుంటుందనే అభిప్రాయం సర్వత్రా వ్యక్తమవుతోంది. ఈ జీఓ అమలైతే ప్రభుత్వ ఆస్పత్రుల్లో పనిచేసే వైద్యులకు తీవ్ర అన్యాయం జరుగుతుంది.


జీఓను రద్దు చేయకుంటే తగ్గేదేలే..!

వైద్యుల హక్కులకు భంగం కలిగించడంతో పాటు పేద ప్రజల ఆరోగ్యంతో చెలగాటం ఆడే జీఓ నెం 85ను రద్దు చేయాల్సిందేనని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా వ్యాప్తంగా వైద్యులు తమ నిరసనలు కొనసాగిస్తున్నారు. జిల్లాలో 56 పీహెచ్‌సీలు, ఏడు సామాజిక ఆస్పత్రులు, రెండు ఏరియా ఆస్పత్రులు ఉండగా అందులో 173 మంది వైద్యులు విధులు నిర్వహిస్తున్నారు. ప్రభుత్వ వైద్యుల మనోభావాలను దెబ్బతినే విధంగా హడావుడిగా ప్రభుత్వం జారీ చేసిన జీఓ 85ను అంతే వేగంగా రద్దు చేయాలంటూ గ్రామీణ ప్రాంతాల్లో పనిచేసే వైద్యులు డిమాండ్ చేస్తున్నారు. అందులో భాగంగా ఈనెల 10 నుంచి నిరసన కార్యక్రమాలు కొనసాగిస్తూ మరోపక్క ప్రభుత్వ వైఖరిని ఎండగడుతున్నారు. ఈనెల 10 నుంచి 12 వరకూ నల్ల బ్యాడ్జీలు ధరించి విధులకు హాజరు కాగా 13, 14 తేదీల్లో అత్యవసర కేసులు మినహా మిగతా సేవలను బహిష్కరించారు. అలాగే డీఎంహెచ్‌ఓ కార్యాలయంలో పీహెచ్‌సీ వైద్యుల బృందం డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని ఇప్పటికే అందజేసింది. జీఓ రద్దు కోరుతూ వైద్యులు నిరసనలు కొనసాగిస్తున్నా ప్రభుత్వం నుంచి చలనం లేదు. దీంతో డైరెక్టర్ ఆఫ్ హెల్త్ కార్యాలయం వద్ద ధర్నా చేసేందుకు ఆదివారం వైద్యుల హక్కుల పరిరక్షణ సమాఖ్య (ఏపీపీహెచ్‌డీఏ) చలో విజయవాడకు పిలుపునిచ్చింది. అయితే డైరెక్టర్ ఆఫ్ హెల్త్ అధికారులు మాత్రం సమస్య పరిష్కారానికి కొద్ది రోజులు గడువు అడగడంతో ఆ మేరకు చలో విజయవాడ కార్యక్రమాన్ని రాష్ట్ర వైద్యుల బృందం వాయిదా వేసుకుంది. అయితే ప్రభుత్వంతో వైద్యులు జరిపిన చర్చలు ఫలప్రదం కాకపోవడంతో మంగళవారం చలో విజయవాడకు వైద్యులు పిలుపునిచ్చారు. అలాగే జిల్లాలో జరిగే డీవార్మింగ్ డేకు మాత్రం వైద్యులు హాజరుకానున్నారు.

వివాదాస్పద నిర్ణయాలతో మసక బారిన ప్రభుత్వ ప్రతిష్ట

అధికారం చేపట్టిన మూడు నెలల వ్యవధిలోనే వివాదాస్పద నిర్ణయాలను తీసుకుంటూ ప్రభుత్వం తమ ప్రతిష్టను రోజురోజుకూ దిగజార్చుకుంటుంది. ఇప్పటికే గత ప్రభుత్వ హయాంలో ఏర్పాటైన ప్రభుత్వ మెడికల్ కళాశాలలను ప్రైవేటు పరం చేసేందుకు ఉపక్రమించడం, ప్రభుత్వ ఆస్పత్రుల్లో పనిచేసే స్టాఫ్ నర్సులకు, జీఎన్ఎంలుగా శిక్షణ పొందిన ఏఎన్ఎంల మధ్య చిచ్చు రగల్చడంతో పాటు గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో విశేష సేవలను అందిస్తున్న ప్రభుత్వ వైద్యుల హక్కులను హరించే విధంగా జీఓ 85ను అమల్లోకి తీసుకురావడం వంటి నిర్ణయాలు ప్రభుత్వం తీసుకుంటున్న అనాలోచిత నిర్ణయాలకు అద్దం పడుతోంది.

వైద్యులు తీవ్రంగా నష్టపోయే ప్రమాదముంది



రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన జీఓ 85 వల్ల పీహెచ్‌సీల్లో పనిచేసే వైద్యులు తీవ్రంగా నష్టపోతారు. గ్రామీణ, ఏజెన్సీ ప్రాంతాల్లో పని చేసిన వైద్యులకు ఎటువంటి ప్రయోజనం సమకూరే అవకాశం లేదు. కోవిడ్-19 సమయంలో ప్రాణాలను సైతం పణంగా పెట్టి ప్రజల ఆరోగ్యాన్ని కాపాడడమే కాదు ప్రాణాలను సైతం రక్షించాం. ఆ సమయంలో అనేక బాధలు ఎదుర్కొన్నా ఎప్పటికప్పుడు ప్రభుత్వానికి అండగా ఉంటూ వచ్చాం. జీఓ అమలుపై ఇకనైనా ప్రభుత్వం పునరాలోచన చేసి వైద్యుల మనోభావాలను పరిరక్షించాలి.

– డి.సువర్చలాదేవి, వైద్యాధికారి, చొప్పెల్ల పీహెచ్‌సీ

క్లుప్తంగా

కారు ఢీకొని నలుగురికి తీవ్ర గాయాలు

తాళ్లరేవు: జాతీయ రహదారి 216లోని పోలేకుర్రు వై.జంక్షన్ వద్ద ఆదివారం రాత్రి గుర్తు తెలియని కారు ఢీకొని ఒకే కుటుంబానికి చెందిన నలుగురికి తీవ్ర గాయాలయ్యాయి. కోరంగి ఎస్సై పి.సత్యనారాయణ తెలిపిన వివరాల మేరకు తాళ్లరేవుకు చెందిన ఒక కుటుంబం ద్విచక్రవాహనంపై యానాం వెళ్లి తిరిగి వస్తుండగా వై.జంక్షన్ వద్ద కారు వేగంగా వచ్చి బైక్‌ను ఢీకొని వెళ్లిపోయింది. ఈ ప్రమాదంలో తాళ్లరేవుకు చెందిన వాతాడి ఉమా దుర్గాప్రసాద్ అతని భార్య నూకరత్నం, పిల్లలు త్రిగుణబాలాశ్రీ, ప్రసన్న కృష్ణలకు గాయాలయ్యాయి. స్థానికులు హుటాహుటిన తాళ్లరేవు సామాజిక ఆస్పత్రికి తరలించి ప్రాథమిక చికిత్స అనంతరం కాకినాడ ప్రభుత్వాస్పత్రికి తరలించగా చికిత్స పొందుతున్నారు. ప్రమాదానికి కారణమైన కారు ఆచూకీ తెలియరాలేదని, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

స్నేహితుడి కుటుంబానికి బాసట

సఖినేటిపల్లి: స్థానిక మొక్కతోటకు చెందిన రావి శాంతిశేఖర్ అనారోగ్యంతో మృతి చెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు. వారి కుటుంబానికి చేయూత అందించాలనే తలంపుతో అతడి స్నేహితులు కలసి తోటి విద్యార్థుల నుంచి రూ.లక్ష విరాళాలు సేకరించారు. వీరంతా శాంతిశేఖర్‌తో కలసి 97–98 బ్యాచ్‌లో లూథరన్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుకున్నారు. సేకరించిన మొత్తాన్ని మృతుడి పిల్లలు సుశాంత్, శాంతి శ్రీస్‌ల భవిష్యత్తుకు వారి పేరిట తలా రూ.50 వేలు పోస్టాఫీసులో డిపాజిట్ చేశారు. ఈ మేరకు ఆ పత్రాలను మృతుడి భార్య రావి సునీతకు సోమవారం అందజేశారు. సహచర విద్యార్థులను పలువురు అభినందించారు.

30 మంది చిన్నారులపై తేనెటీగల దాడి



తేనెటీగల దాడిలో గాయపడి చికిత్స పొందుతున్న చిన్నారులు

రాజోలు: గణేశ్ నిమజ్జనం వేడుకల్లో పాల్గొన్న 30 మంది చిన్నారులపై తేనెటీగలు దాడి చేయడంతో సోమవారం వారిని చికిత్స నిమిత్తం రాజోలు ప్రభుత్వాస్పత్రికి తీసుకువచ్చారు. మామిడికుదురు మండలం మగటపల్లి గ్రామం నుంచి గోగన్నమఠం రేవునకు వినాయకుడి విగ్రహాన్ని ట్రాక్టర్‌పై ఊరేగింపుగా తీసుకువెళ్తున్నారు. స్థానిక హైస్కూల్ సెంటర్‌కు వచ్చేసరికి ఊరేగింపులో భాగంగా తారాజువ్వను వెలిగించడంతో అది సమీపాన చెట్టుపై ఉన్న తేనెపట్టుకు తగిలింది. దీంతో ఒక్కసారిగా తేనెటీగలు చెలరేగి ట్రాక్టర్‌పై కూర్చుని ఉన్న చిన్నారులపై దాడి చేశాయి. దీంతో వారిని చికిత్స నిమిత్త రాజోలు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. వీరిలో ఇద్దరు పరిస్థితి ఆందోళనకరంగా ఉండడంతో మెరుగైన చికిత్స కోసం అమలాపురం ప్రైవేటు ఆస్పత్రికి తీసుకువెళ్లారు. తేనెటీగల దాడిలో గాయపడ్డ చిన్నారులను రాజోలు ఎమ్మెల్యే దేవ వరప్రసాదరావు, మాజీ జెడ్పీ చైర్మన్ నామన రాంబాబు పరామర్శించి బాధిత చిన్నారులకు మెరుగైన చికిత్స అందించాలని వైద్య సిబ్బందికి సూచించారు.

కందుకూరి స్ఫూర్తి.. విద్యా దీప్తి

- స్త్రీ విద్యకు ఆనాడే బీజం
- దాని కోసమే కందుకూరి దంపతుల కలలు
- సినీనటులు, గాయకుల ప్రదర్శనల విరాళాలతో సౌకర్యాలు
- రాష్ట్ర స్థాయిలో ఐదు, జాతీయ స్థాయిలో 71వ స్థానంలో నిలిచిన కందుకూరి రాజ్యలక్ష్మి ప్రభుత్వ మహిళా కళాశాల



కళాశాల ప్రాంగణం



కందుకూరి దంపతుల విగ్రహాలు

సీటీఆర్ఐ (రాజమహేంద్రవరం): స్త్రీ విద్యావంతురాలు అయితే సమాజానికి వెలుగు అని సంఘ సంస్కర్త, సాహితీవేత్త కందుకూరి వీరేశలింగం పంతులు ఆ రోజుల్లోనే గుర్తించారు. ఎంతో ధైర్యంతో మూఢనమ్మకాలు, మత చాందసవాదులను ఎదుర్కొని వితంతువులకు మరలా వివాహాలు జరిపించారు. వారికి కూడా ఒక జీవితం ఉందని నిరూపించారు. చదువుతోనే వారి జీవితానికి స్వేచ్ఛ లభిస్తుందని ఆయన భావించారు. దానికి ప్రతిరూపమే ఆయన నెలకొల్పిన మహిళా కళాశాల. ఆ విత్తనమే నేడు మహావృక్షంగా మారి ఎందరో మహిళలను విద్యావంతులుగా తయారు చేస్తోంది. నేడు ఆయనను స్మరించుకోవడానికి గల ప్రత్యేక కారణం వరల్డ్ ఎడ్యుకేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన సర్వేలో ఆయన స్థాపించిన కళాశాల రాష్ట్ర వ్యాప్తంగా ఐదో స్థానంలో, దేశవ్యాప్తంగా 71వ స్థానంలో నిలవడమే.

సినీ నటులు, గాయకుల ప్రదర్శన విరాళాలతో...

1971లో ఎమ్మెస్ సుబ్బులక్ష్మి గాత్ర కచేరి ద్వారా వచ్చిన రూ.1.50 లక్షల నిధితో ల్యాబొరేటరీ రూపుదిద్దుకుంది. అలాగే 1976లో సినీ నటి మంజుల నాట్యంతో సమకూర్చుకున్న నిధులతో కళాశాల కాంపౌండ్ వాల్ నిర్మించారు. ప్రైవేటు అద్దె ఇంట్లో ఉన్న హాస్టల్, యూజీసీ గ్రాంట్‌తో 200 మందికి నివాసయోగ్యమైన హాస్టల్‌గా నేడు దూర ప్రాంతాల ఆడపిల్లలకి వసతి కల్పిస్తోంది. సినీ నటి, అనాటి ఎంపీ జయప్రద ఎంపీ ఫండ్ నుంచి ఇచ్చిన నిధులతో 1993లో కళాశాలలో టీచింగ్ స్టాఫ్ రూంల బ్లాక్ నిర్మాణం జరిగింది. తదనంతరం దశలవారీగా పక్కా బిల్డింగులు, క్లాస్ రూముల నిర్మాణాలు చేపట్టారు. ఇటీవల కేంద్ర ప్రభుత్వం అందించిన రాష్ట్రీయ ఉచ్చతర్ శిక్షా అభియాన్ ఫండ్ (రూసా) నిధులతో సమగ్రమైన మీటింగ్ హాలు నిర్మాణం కూడా పూర్తయింది. కళాశాల స్వర్ణోత్సవ వేడుకల్లో భాగంగా దాతల విరాళంతో చక్కని ఆడిటోరియం, సువిశాల క్రీడా ప్రాంగణం, అధునాతన ల్యాబొరేటరీలు నిర్మితమయ్యాయి. అనుభవజ్ఞులైన అధ్యాపకులతో విరాజిల్లుతున్న ఈ కళాశాల 1973లో గ్రాంటు ఇన్ ఎయిడ్‌లో ప్రవేశించి ఆర్థిక ఇబ్బందులను సైతం అధిగమించింది. తర్వాత హితకారిణి సమాజం, దేవదాయ ధర్మదాయ శాఖ అధీనంలో పనిచేయడంతో కళాశాలను కూడా ఆ శాఖకు అనుసంధానం చేశారు. ఇటీవల కాలంలో ఉద్యోగుల జీతభత్యాలకు కళాశాల నిర్వహణకు అనేక ఆర్థిక ఇబ్బందులు కలుగుతున్న కారణంగా, ఎయిడెడ్ స్టాఫ్ రిటైర్ అయిపోగా వారి స్థానంలో ప్రభుత్వ రిక్రూట్‌మెంట్లు లేకపోవడం వల్ల వీరేశలింగం పంతులు వీలునామా ప్రకారం కళాశాలను ప్రభుత్వ పరం చేశారు. 2022 ఆగస్టు నుంచి ఈ కళాశాల ప్రభుత్వ కళాశాలగా రూపాంతరం చెంది మరింత ఎక్కువగా చుట్టుపక్కల గ్రామీణ విద్యార్థినులకు విద్య అందించడంలో కృషి చేస్తోంది. నేక్ బృందం బీ–ప్లస్ గ్రేడ్‌ని గత మూడు దఫాలుగా నిలబెట్టుకుంటూ రాష్ట్ర స్థాయిలో ఉన్నతమైన పది కళాశాలల్లో ఐదో స్థానంలో నిలిచింది. ఈ కళాశాలలో చదివిన విద్యార్థినులు అనేక ఉన్నత రంగాల్లో ఉన్నత పదవుల్లో దేశ, విదేశాల్లో స్థిరపడి కళాశాల అభివృద్ధికి చేదోడువాదోడుగా నిలుస్తున్నారు.

కందుకూరి ఆశయాలను కొనసాగిస్తాం



ఈ కళాశాలలో అభ్యసించిన విద్యార్థినులు చదువుతో పాటు సంస్కారం, విలువలు సంఘంలో ధైర్యంగా మనుగడ సాగించడం వంటి వాటిని కూడా నేర్చుకుని తమ జీవితాల్లో వాటిని అమలు చేసుకుంటూ విభిన్న రంగాల్లో స్థిరపడ్డారు. ప్రభుత్వ కళాశాల అవడం వల్ల ముఖ్యంగా కళాశాల మీద ఆర్థిక భారం తగ్గింది. విద్యార్థినులకు సముచితమైన బోధన అందిస్తూ వారి సమగ్ర అభివృద్ధికి అధ్యాపకులు కృషి చేస్తున్నారు. వీరేశలింగం దంపతుల ఆశయ సాధనకు, స్త్రీ విద్యావ్యాప్తికి 56 ఏళ్లుగా ఈ కళాశాల కృషి చేస్తూనే ఉంది.

– డాక్టర్ రాఘవ కుమారి, కళాశాల ప్రిన్సిపాల్, ఎస్ఆర్‌కే ప్రభుత్వ డిగ్రీ మహిళా కళాశాల

మహిళలు విద్యావంతులు కావాలి



స్త్రీ విద్యా వ్యాప్తి లక్ష్యంగా ఎన్నో ఒడిదొడుకులు, అవమానాలు ఎదుర్కొని, ఆడపిల్ల విద్యావంతురాలు కావాలి. ఆ ఆశయంతో కందుకూరి వీరేశలింగం పుణ్య దంపతుల ఆశీర్వాదంతో స్థాపించబడిన ఈ కళాశాల ప్రభుత్వ మహిళా కళాశాలగా రూపాంతరం చెందింది. రాబోయే రోజుల్లో మరెందరో విద్యార్థినులను విద్యావేత్తలుగా తీర్చిదిద్దాలని ఆశిస్తున్నాను. మహిళా సాధికారత మన కళాశాల నుంచి మొదలైందని నమ్ముతున్నాను. ఈ కళాశాల పూర్వ విద్యార్థిని కావడంతో పాటు ఇదే కళాశాలలో 20 ఏళ్లుగా అధ్యాపకురాలిగా పనిచేస్తున్నందుకు చాలా గర్వంగా, ఆనందంగా ఉంది.

– పి.కుసుమ కామేశ్వరి, తెలుగు విభాగాధిపతి

ఆత్మవిశ్వాసం పెరిగింది



అంగవైకల్యం ఉన్నా చదువు వల్ల ఆత్మవిశ్వాసం పెరుగుతుంది. నేను సీనియర్ ఇంటర్‌లో సీఈసీ చదువుతున్నాను. మొదటి సంవత్సరంలో గ్రూప్ టాపర్‌గా నిలిచాను. అంతే కాకుండా కళాశాలలో అధ్యాపకులు ఇచ్చిన ప్రోత్సాహంతో మొక్కలతో వివిధ ఆకృతుల్లో ఇంటికి పనికి వచ్చే వస్తువులను తయారు చేస్తాను. అందమైన కళారూపాలను తయారు చేయడానికి కళాశాలలో పెరుగుతున్న పిచ్చి మొక్కలను ఉపయోగిస్తాను.

– రుక్మిణి, కళాశాల విద్యార్థిని

క్రీడల్లో రాణిస్తున్నాను



నేను ఈ కళాశాలలో చదువుతున్నాను. అలాగే క్రీడల్లో కూడా రాణిస్తూ.. కరాటేలో 8 బంగారు పతకాలు సాధించాను. అదే విధంగా 5 రజత పతకాలు సాధించాను. నాకు ప్రోత్సాహం అందించిన స్పోర్ట్స్ ఇన్‌స్ట్రక్టర్ సుధారాణి ఆధ్వర్యంలో ఈ పతకాలు సాధించాను. అంతేకాకుండా కళాశాలలో సహాయక వాతావరణం వల్ల క్విజ్, డిబేట్లు, వ్యాసరచన, పెయింటింగ్‌లో నైపుణ్యం సాధించాను.

– పి.శ్రీవిద్య, విద్యార్థిని

ముగిసిన రాష్ట్ర స్థాయి టెన్నికాయిట్ పోటీలు



గెలుపొందిన క్రీడాకారులతో అధికారులు, నాయకులు

వజ్రపుకొత్తూరు రూరల్: వజ్రపుకొత్తూరులో శనివారం ప్రారంభమైన 36వ ఆంధ్రప్రదేశ్ అంతర జిల్లాల (రాష్ట్ర స్థాయి) బాల బాలికల టెన్నికాయిట్ క్రీడా పోటీలు సోమవారంతో ముగిశాయి. గత రెండు రోజులుగా హోరాహోరీగా సాగిన ఈ పోటీల్లో బాలుర విభాగం నుంచి ఎన్.గౌతమ్ సంజయ్ (తూర్పుగోదావరి) ప్రతిభ కనబర్చి ప్రథమ స్థానంలో నిలిచాడు. ద్వితీయ స్థానంలో ఎస్.సాయికుమార్ (విజయనగరం), తృతీయ స్థానంలో కేఎస్ శంకరప్రసాద్ (తూర్పుగోదావరి)తో పాటు వరుసగా 4, 5, 6 స్థానాల్లో జి.మహీధర్ (అనంతపురం), బి.సత్యనారాయణ (తూర్పుగోదావరి), డి.రోహిత్(విశాఖపట్నం), అలాగే బాలికల విభాగం నుంచి ప్రథమ స్థానంలో కె.జ్యోతిక (అనంతపురం), ద్వితీయ స్థానంలో హెచ్.దీక్షిత (అనంతపురం), తృతీయ స్థానంలో హెచ్.స్పందన (అనంతపురం)తో పాటు వరుసగా 4, 5, 6 స్థానాల్లో ఆర్.సంస్కృతి (పశ్చిమగోదావరి), కె.ఇందు (విజయనగరం), బి.గాయత్రి(చిత్తూరు) నిలిచారు. జమ్మూకశ్మీర్‌లో ఈ నెల 30 నుంచి అక్టోబర్ 4 వరకు జరగనున్న జాతీయ టెన్నికాయిట్ పోటీలకు వీరు ఎంపికైనట్లు క్రీడా నిర్వాహకుడు పైల గజేంద్ర, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు తారకేశ్వర పండా తెలిపారు. జాతీయ స్థాయి పోటీలకు ఎన్నికైన బాలికలు అనకాపల్లిలో, బాలురు తూర్పుగోదావరి మండపేటలో శిక్షణ పొందుతారని వారు తెలిపారు. విజేతలకు అధికారులు, పలువురు నాయకుల చేతుల మీదుగా బహుమతులు, ప్రశంసా పత్రాలను అందజేశారు.

పిచ్చి కుక్క స్వైర విహారం



పిచ్చికుక్క దాడిలో గాయపడి చికిత్స పొందుతున్న బాలుడు

రాజోలు: మండలంలోని మగటపల్లి గ్రామంలో సోమవారం పిచ్చికుక్క స్వైర విహారం చేసి 10 మందిని తీవ్రంగా గాయపరిచింది. ఈ ఘటనలో గాయపడిన మహిళలు, వృద్ధులు, చిన్నారులను రాజోలు ప్రభుత్వాస్పత్రికి తీసుకొచ్చి చికిత్స అందించారు. గాయపడిన వారికి వ్యాక్సిన్ ఇచ్చి పరిశీలన కోసం వార్డులో ఉంచామని వైద్య సిబ్బంది తెలిపారు.

ఓవరాల్ టీమ్ చాంపియన్‌గా గుంటూరు



పవర్ లిఫ్టింగ్ పోటీల్లో ఓవరాల్ టీమ్ చాంపియన్ షిప్ సాధించిన గుంటూరు జట్టుకు ట్రోఫీ అందజేస్తున్న డాక్టర్ బాలాజీ, అసోసియేషన్ ప్రతినిధులు

అమలాపురం టౌన్: అమలాపురం ఆఫీసర్స్ రిక్రియేషన్ క్లబ్ ప్రాంగణంలో రెండు రోజుల పాటు జరిగిన 11వ ఆంధ్రప్రదేశ్ పవర్ లిఫ్టింగ్ చాంపియన్ షిప్–2024 పోటీల్లో ఓవరాల్ టీమ్ చాంపియన్ షిప్‌ను గుంటూరు జిల్లా జట్టు కైవసం చేసుకుంది. తొలి రోజు శనివారం మహిళల విభాగంలో పోటీలు, రెండో రోజు ఆదివారం పురుష పవర్ లిఫ్టర్లకు పోటీలు నిర్వహించారు. పోటీల ముగింపు సభతో పాటు బహుమతి ప్రదానోత్సవం ఆదివారం అర్ధరాత్రి దాటిన తర్వాత ముగిశాయి. పోటీలు జిల్లా పవర్ లిఫ్టర్ అసోసియేషన్, అమలాపురం హెల్త్ ఫిట్‌నెస్ జిమ్ స్పోర్ట్స్ క్లబ్ సంయుక్త ఆధ్వర్యంలో హైదరాబాద్, విశాఖపట్నం మెట్రో కెమ్ కంపెనీల సౌజన్యంతో జరిగిన సంగతి తెలిసిందే. ముగింపు సభకు ఆ కంపెనీల అధినేత డాక్టర్ నందెపు బాలాజీ ముఖ్యఅతిథిగా పాల్గొని పోటీల విజేతలకు ట్రోఫీలు, బహుమతులు ప్రదానం చేశారు. వచ్చే ఏడాది జాతీయ పవర్ లిఫ్టింగ్ పోటీలను జిల్లా అసోసియేషన్ నిర్వహిస్తే అందుకు తాను పూర్తిగా సహకరిస్తానని బాలాజీ హామీ ఇచ్చారు. పురుషుల విభాగం విజేతలను హెల్త్ ఫిట్‌నెస్ జిమ్ స్పోర్ట్స్ క్లబ్ కోచ్ డాక్టర్ కంకిపాటి వెంకటేశ్వరరావు వెల్లడించారు. పోటీల ఓవరాల్ చాంపియన్ షిప్‌గా గుంటూరు జిల్లా జట్టు ప్రథమ స్థానంలో నిలిచింది. ద్వితీయ స్థానాన్ని విజయనగరం జిల్లా జట్టు, తృతీయ స్థానాన్ని విశాఖపట్నం జిల్లా జట్టు కైవసం చేసుకున్నాయి.

రాష్ట్ర స్ట్రాంగ్ మెన్ విజేతలు వీరే..

పోటీల్లో రాష్ట్ర స్ట్రాంగ్ మెన్‌గా సాధించిన సబ్ జూనియర్, జూనియర్, సీనియర్ విభాగాల నుంచి ప్రథమ, ద్వితీయ, తృతీయ విజేతలిలా ఉన్నారు. సబ్ జూనియర్స్ పురుషుల విభాగంలో ప్రథమ స్థానాన్ని పి.జాన్‌బాబు (కృష్ణా జిల్లా), ద్వితీయ స్థానాన్ని బి.యశ్వంత్‌కుమార్ (కోనసీమ జిల్లా), తృతీయ స్థానాన్ని పి.దినేష్ (అనకాపల్లి జిల్లా) సాధించారు. జూనియర్స్ విభాగంలో ప్రథమస్థానాన్ని ఎస్.శరత్ (పల్నాడు జిల్లా), ద్వితీయ స్థానాన్ని ఎస్.బాలసాయిచరణ్ (అనకాపల్లి జిల్లా), తృతీయ స్థానాన్ని జె.లవకుమార్ (అనకాపల్లి జిల్లా) కైవసం చేసుకున్నారు. సీనియర్స్ విభాగంలో ప్రథమ స్థానాన్ని కె.యశ్వంత్ (విశాఖ జిల్లా), ద్వితీయ స్థానాన్ని కేవీవీఎస్‌పీ ప్రసాద్ (అనకాపల్లి జిల్లా), తృతీయ స్థానాన్ని ఎస్.శరత్ (పల్నాడు జిల్లా) గెలుచుకున్నారు. ఈ తొమ్మిది మంది పవర్‌లిఫ్టర్లపై మూడు కేటగిరీల్లో మొదటి మూడు స్థానాల్లో స్ట్రాంగ్ మెన్స్‌గా నిలిచారు. చివరగా పోటీల నిర్వహణకు పూర్తి సహాయ సహకారాలు అందించిన మెట్రో కెమ్ కంపెనీల అధినేత డాక్టర్ బాలాజీని జిల్లా పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్ తరఫున ఘనంగా సత్కరించి కృతజ్ఞతలు తెలిపారు. పోటీల ముగింపు కార్యక్రమంలో జిల్లా ఒలింపిక్ అసోసియేషన్ అధ్యక్షుడు అల్లాడ శరత్, కోనసీమ బ్యాడ్మింటన్ అసోసియేషన్ అధ్యక్షుడు మెట్ల రమణబాబు, పవర్ లిఫ్టింగ్ జిల్లా అసోసియేషన్ ప్రతినిధులు నగభేరి కృష్ణమూర్తి, గారపాటి శేఖర్, మున్సిపల్ మాజీ చైర్మన్ చిక్కాల గణేష్, యేడిద శ్రీను, వంటెద్దు బాబి, పప్పుల శ్రీరామచంద్రమూర్తి, కల్వకొలను బాబు తదితరులు పాల్గొన్నారు. పోటీలకు న్యాయ నిర్ణేతలుగా వ్యవహరించిన ఎనిమిది మంది పవల్ లిఫ్టింగ్ నిపుణులను జిల్లా అసోసియేషన్ సత్కరించి కృతజ్ఞతలు తెలిపింది.

బిక్కవోలు లడ్డూ రూ.1,11,116



బిక్కవోలు లడ్డూ దక్కించుకున్న నీలమేఘున కుటుంబ సభ్యులు

బిక్కవోలు: మండలంలోని బిక్కవోలు కొలువైన ఉన్న శ్రీలక్ష్మీ గణపతి స్వామి ఆలయం లడ్డూ పాట నిర్వహించారు. సోమవారం గణపతి నవరాత్రుల్లో భాగంగా ఆలయం వద్ద 50 కేజీల లడ్డూకు పాట నిర్వహించగా హైదరాబాద్ చెందిన వై.నీలమేఘున దక్కించుకున్నారు. అలాగే మరో 100 కేజీల లడ్డూలను రూ.61,116 విజయవాడ చెందిన పరవత్ సింగ్ దక్కించుకున్నారు. దీంతో లడ్డూల వేలం ద్వారా రూ.1,72,232 వచ్చినట్లు ఆలయం సిబ్బంది తెలిపారు. ఆలయం వద్ద ఏర్పాటు చేసిన మహా అన్నసమారాధనను ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి–మహాలక్ష్మి దంపతులు ప్రారంభించారు. కార్యక్రమంలోని నాయకులు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

మొగళ్లమూరులో..

అల్లవరం: మొగళ్లమూరు సెంటర్లో కొలువైన సిద్ధి వినాయక స్వామి వారికి కమిటీ వారు సమర్పించిన లడ్డూని గ్రామానికి చెందిన తోటకూర సత్యనారాయణరాజు రూ.54,999కు వేలంలో కైవసం చేసుకున్నారు. అనంతరం లడ్డూని ఊరేగింపుగా తీసుకెళ్లారు. కార్యక్రమంలో సర్పంచ్ రాయుడు విష్ణు, మాజీ సర్పంచ్ కాండ్రేగుల పెద్దబ్బాయి, గోపాలకృష్ణరాజు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

గణపతి లడ్డూను రూ.2.01 లక్షలకు పాడిన పులవర్తి సన్స్



రూ.2.01 లక్షలకు లడ్డూను దక్కించుకున్న పులవర్తి సోమరాజు సన్స్

కాకినాడ సిటీ: బంగారు, వెండి, డైమండ్స్ వర్తక సంఘం 85వ గణపతి నవరాత్ర ఉత్సవాల్లో గణపతి 85 కేజీల లడ్డూను ఉత్సవ కమిటీ చైర్మన్ పులవర్తి సోమరాజు అండ్ సన్స్ పులవర్తి సీతారామమూర్తి, శ్రీనివాస్‌లు రూ.2.01 లక్షలకు పాడి రికార్డు సృష్టించారు. అదే విధంగా మూల విరాట్‌కు అలంకరించిన రూ.32 వేల కరెన్సీ నోట్ల దండను తాళ్లూరు సత్తిబాబు రూ.75 వేలకు వేలంలో దక్కించుకున్నారు. ఈ వేలం కేవలం వర్తక సంఘం సభ్యులకు మాత్రమే పాడుకొనే అవకాశం ఆనవాయితీ. ఈ ఉత్సవాలను ఎంతో ఘనంగా నిర్వహించిన వర్తక సంఘం అధ్యక్షుడు అనిశెట్టి రామకృష్ణను నగర ప్రముఖులు అభినందించారు. అనంతరం వివిధ సాంస్కృతిక కార్యక్రమాల మధ్య స్వామి నిమజ్జనానికి భారీ ఊరేగింపుతో బయలుదేరి వెళ్లారు. కార్యక్రమంలో వర్తక సంఘం నాయకులు పాల్గొన్నారు.

మోటారు సైకిళ్లు మాయం చేస్తున్న మైనర్లు

- అదుపులోకి తీసుకున్న కడియం పోలీసులు
- పది మోటారు సైకిళ్లు స్వాధీనం

కడియం: జిల్లా వ్యాప్తంగా పలు చోట్ల మోటారు సైకిళ్ల(బైక్)లను మాయం చేస్తున్న నలుగురు మైనర్లను కడియం పోలీసులు అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి 10 బైక్‌లను స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు స్థానిక పోలీస్ స్టేషన్‌లో దక్షిణ మండలం డీఎస్పీ భవ్యకిశోర్ విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి వివరాలు తెలియజేశారు. కడియం మండలం పరిధిలో వరుసగా బైక్‌లు మాయమవుతున్న నేపథ్యంలో ఇన్‌స్పెక్టర్ ఎం.వేంకటేశ్వరరావు ఆధ్వర్యంలో ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేశారు. సోమవారం మధ్యాహ్నం మాధవరాయుడుపాలెం పంచాయతీ పరిధిలోని చైతన్యనగర్ శివారు దాండుబాబు గుడి దగ్గర నలుగురు మైనర్లు బైక్‌లపై అనుమానాస్పదంగా తిరుగుతుండగా కడియం ఎస్సై బి.నాగదుర్గాప్రసాద్ తమ సిబ్బందితో గుర్తించారు. వారిని పట్టుకుని ఆరా తీయగా ఈ నలుగురు పందలపాక, జి.మామిడాడ గ్రామాలకు చెందిన మరికొందరితో కలసి కడియం, రాజానగరం, పెరవలి, పెద్దాపురం, సర్పవరం, రాజమహేంద్రవరం, యానాం పోలీస్‌స్టేషన్ల పరిధిలో బైక్‌లు చోరీ చేస్తున్నట్లు అంగీకరించారు. ఈ బృందం చోరీ చేసిన ఏడు పల్సర్ బైక్‌లు, ఒక హెచ్ఎఫ్ డీలక్స్, ఒక ఫ్యాషన్‌ప్లస్, ఒక స్ప్లెండర్ బైక్‌ను స్వాధీనం చేసుకున్నారు. వీటిలో కడియం పోలీస్ స్టేషన్ పరిధిలో రెండు పల్సర్లు, ఒక హెచ్ఎఫ్ డీలక్స్ బైక్ ఉన్నాయని డీఎస్పీ తెలిపారు. నలుగురు మైనర్లను మూడో ఏజేఎఫ్‌సీఎం కోర్టు ముందు హాజరు పర్చామని వివరించారు. వీటిని పట్టుకోవడంలో కీలకపాత్ర వహించిన హెడ్‌కానిస్టేబుల్ కె.సురేష్‌బాబు, ఎం.సురేష్‌కుమార్, కానిస్టేబుళ్లు జి.రవికుమార్, కేవీ లక్ష్మణ్, వై.శివకృష్ణ, పి.భీమారావు, వై.రాహుల్, యు.నాగబాబు, ఎంపీహెచ్ కుమార్‌లను ఈ సందర్భంగా ఉన్నతాధికారులు అభినందించారు. సమావేశంలో ఇన్‌స్పెక్టర్ వేంకటేశ్వరరావు, ఎస్సై నాగదుర్గాప్రసాద్, సిబ్బంది పాల్గొన్నారు.